క్లుప్తంగా

ఆరోగ్య సురక్ష శిబిరాల ప్రాధాన్యతను తెలియజేయాలి



భగ్గేశ్వరంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సందర్శిస్తున్న భాను నాయక్

పాలకొల్లు అర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ప్రాధాన్యతను వైద్య సిబ్బంది ప్రజలకు తెలియజేసి ఈ శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా చూడాలని జిల్లా ఉపవైద్యాధికారి డా.భాను నాయక్ కోరారు. పాలకొల్లు మండలం భగ్గేశ్వరం గ్రామ సచివాలయం వద్ద బుధవారం నిర్వహించిన ఆరోగ్య సురక్షా వైద్య శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. శిబిరంలో గర్భిణులకు సేవలందించి వారికి నెలవారీ పరీక్షలతో పాటు మందులు అందించాలని సూచించారు. బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేయాలన్నారు. టీబీ వ్యాధిగ్రస్తులను పరీక్షించి వారికి మందులతో పాటు పౌష్టికాహార కిట్లు అందజేయాలన్నారు. శిబిరంలో డా.టీనా సుప్రియ, డా.గంగాభవాని, డా.కల్యాణ్ చక్రవర్తి రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి లింగం సత్యనారాయణ, శంకరం పాల్గొన్నారు.

ఘనంగా హనీమన్ జయంతి



శామ్యూల్ హనీమన్‌కు నివాళులు అర్పిస్తున్న హోమియో వైద్యులు

నరసాపురం: హోమియో పితామహుడు డాక్టర్ శామ్యూల్ హనీమన్ 289వ జయంతిని జిల్లా రిజిస్టర్డ్ హోమియో వైద్యుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. టేలర్ హైస్కూల్ సమీపంలో ఉన్న హనీమన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శిరిగినీడి రమేష్, డాక్టర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా హోమియో వైద్యానికి గుర్తింపు ఉందన్నారు. నరసాపురంలో డాక్టర్ నాగభూషణం చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. సంఘ ప్రతినిధులు పల్లా వెంకటేశ్వరరావు, జాన్ హెన్రీ, ఎంఎస్ స్వామి, జనార్ధన్, పావని, శిరిగినీడి ఉమ పాల్గొన్నారు.

నేడు 30వ వార్డులో గుడాల గోపి ఎన్నికల ప్రచారం

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని 30వ వార్డు మావుళ్లమ్మ ఆలయం వద్ద నుంచి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రచారం కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వలంటీర్లపై చంద్రబాబు మొసలి కన్నీరు



పూలపల్లిలో విలేకరులతో మాట్లాడుతున్న టీటీడీ సభ్యుడు మేకా శేషుబాబు

పాలకొల్లు అర్బన్: వలంటీర్లపై చంద్రబాబు మొసలి కన్నీరు కారుస్తూ వారికి జీతం రూ.10 వేలు ఇచ్చి వారి సేవలను కొనసాగిస్తామని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని టీటీడీ సభ్యుడు మేకా శేషుబాబు విమర్శించారు. పూలపల్లిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో చంద్రబాబు వలంటీర్లను ఘోరంగా అవమానించారన్నారు. గోనె సంచులు మోసే వారని, మగవారు లేనప్పుడు తలుపులు కొడుతూ మహిళలను మానసికంగా వేధిస్తున్నారని విమర్శించారని అన్నారు. ఇప్పుడు అధికార దాహంతో మాట మార్చారని దుయ్యబట్టారు. వలంటీర్లు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రులన్నారు. సీఎం జగన్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. చంద్రబాబు అవమానాలను భరించలేక వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తున్నారని, ఇది చూసి ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవ్వడం చూసి చంద్రబాబు మాటమార్చారని స్పష్టం చేశారు. ఇప్పటికే వారి మేనిఫెస్టోలో పెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలు విశ్వసించడం లేదని విమర్శించారు. విలేకరుల సమావేశంలో యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్ బాబు, ఎం.మైఖేల్‌రాజు, మరపట్ల ప్రవీణ్‌కుమార్, వాకా సత్తిబాబు, బందెల నరేష్, నాగాబత్తుల జాన్ తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ

భీమవరం(ప్రకాశం చౌక్): మావుళ్లమ్మ అమ్మవారికి బుధవారం తణుకు చెందిన పెనుగొండ మౌర్య సాయిశృతి దంపతుల 10 గ్రాముల బంగారం సమర్పించారు. అలాగే భీమవరం పట్టణానికి చెందిన గుండాసి మణికంఠ, లక్ష్మీ దంపతుల కుమారుడు నేహస్ర శ్రీరుద్ర 4 గ్రాముల బంగారాన్ని అందజేశారు. వీరికి ఆలయ ఉపప్రధాన అర్చకులు కొప్పేశ్వరావు పూజలు నిర్వహించి ప్రసాదం అందించారు.

ఆపదలో ఆదుకున్న శ్రీరంగనాథరాజు

- కరోనా విలయానికి నాలుగేళ్లు
- ఇంటింటా నిత్యావసర వస్తువులు అందించిన రంగనాథరాజు
- గ్రామీణ పెనుగొండలో క్వారంటైన్ సెంటర్ ఏర్పాటు



పెనుగొండలో నిత్యాసరాల ప్యాకింగ్‌ను పర్యవేక్షిస్తున్న మాజీ మంత్రిశ్రీరంగనాథరాజు (ఫైల్)

పెనుగొండ: కరోనా వైపరీత్యానికి నాలుగేళ్లు పూర్తయ్యింది. రాష్ట్రంలో తొలి కేసు పెనుగొండలో నమోదై అతలాకుతమైతే నేనున్నాంటూ మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ధాతృత్వంతో ఆదుకుని అండగా నిలిచి మనస్సున్న మారాజుగా ప్రజల మనస్సుల్లో నిలిచారు. పెనుగొండలో 2020 మార్చి 22 నుంచి లాక్‌డౌన్‌తో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అయితే ఏప్రిల్ 1 నుంచి కరోనా కేసులు మరింతగా నమోదు కావడం ప్రారంభించాయి. దీంతో పెనుగొండ తొలుత 820 మీటర్ల పరిధిలో నిషేధాజ్ఞలు జారీ చేసి రెడ్ జోన్ ప్రకటించారు. కేసుల సంఖ్య పెరగడంతో గ్రామమంతా రెడ్ జోన్‌గా ప్రకటించారు. దీంతో ప్రజలు నిత్యావసర వస్తువులు అందక విలవిల్లాడిపోయారు. బిక్షగాళ్లకు, పెనుగొండ సంత మార్కెట్ ఆవాసంగా ఏర్పాటు చేసుకుని ఉంటున్న పాముల పట్టేవాళ్లు, ఎలుకల పట్టేవాళ్లకు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి భోజన ఏర్పాటు చేశారు. అనంతరం అధికారులు సైతం ఇబ్బందులు పడుతుండడంతో సుమారు 6 వేల మందికి నిత్యం భోజనం సదుపాయం కల్పించి ఆదుకున్నారు. పెనుగొండలోని కుటుంబాల్లో నిత్యావసర వస్తువులు నిండుకోవడంతో సుమారు 20 రకాల నిత్యావసర వస్తువులు, కూరగాయలు సుమారు రూ.50 లక్షల విలువైన ప్రత్యేక కిట్లుగా ఏర్పాటు చేసి సుమారు 10 వేల కుటుంబాలకు ఒక్క రోజులోనే వలంటీర్లు ద్వారా అందించారు. పేద, ధనిక తేడా లేకుండా అన్ని కుటుంబాలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేసి ప్రజల మన్ననలు పొందారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

కష్టకాలంలో వలంటీర్లు వ్యవస్థ పెనుగొండలో శ్రీరామరక్షగా నిలిచింది. రెడ్ జోన్‌లో ఎవరూ ప్రవేశించకుండా వలంటీర్లు ద్వారా ఆదుకోవాలన్న సీఎం జగన్ ఆదేశాలతో అధికారులు వలంటీర్లు ద్వారా ప్రజలకు సేవలందించారు. ఏ ఒక్కకుటుంభానికి ఇబ్బందులు రాకుండా సేవలు అందించారు.

గ్రామంలో ఏకైక క్వారంటైన్

పట్టణ ప్రాంతాలకే పరిమితమైన కరోనా క్వారంటైన్ సెంటర్లను మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు పెనుగొండలో ఏర్పాటు చేసి అండగా నిలిచారు. ఆచంట నియోజకవర్గంలో కరోనా బారిన పడిన ఏ ఒక్కరికీ ఇబ్బందులు రాకుండా పెనుగొండ ఎస్వీకేపీలో క్వారంటైన్ సెంటర్ ఏర్పాటు చేశారు.

అంబులెన్స్‌ల ఏర్పాటు

ప్రతిపక్ష నాయకులు ఇళ్లకే పరిమితమైతే మాజీ మంత్రిశ్రీరంగనాథరాజు కరోనా కాలంలో నియోజకవర్గమంతా పర్యటిస్తూ ప్రజల అవసరాలను గుర్తిస్తూ ముందుకు సాగారు. అంబులెన్స్‌ల ఇబ్బందులను గమనించి సొంత ఖర్చులతో అంబులెన్స్‌లు ఏర్పాటు చేసి ప్రజల మన్ననలు పొందారు.



పెనుగొండలో నిర్మానుష్యంగా రహదారులు (ఫైల్)



పెనుగొండ రెడ్‌జోన్ పరిధిలో పహారా కాస్తున్న పోలీసులు (ఫైల్)



కోవిడ్ సమయంలో పెనుగొండలో పర్యటిస్తున్న శ్రీరంగనాథరాజు (ఫైల్)

నేడు మేడపాడులో వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

యలమంచిలి: యలమంచిలి మండల వైఎస్సార్ సీపీ ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం సాయంత్రం నాలుగు గంటలకు మేడపాడు గ్రామంలో ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేడపాడు సొసైటీ అధ్యక్షుడు గుర్రాల వెంకట్రావు ఇంటి వద్ద సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. పాలకొల్లు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశానికి మండలంలోని 32 గ్రామాల పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పార్టీ ముఖ్య నాయకులు తప్పనిసరిగా హాజరు కావాలని బుచ్చిరాజు కోరారు.

నేటి నుంచి అమ్మవార్ల కల్యాణ మహోత్సవాలు

మొగల్తూరు: మండలంలోని పేరుపాలెం మోళ్లపర్రు బీచ్ ప్రాంతంలో ఉన్న దశావతార సహిత మహా మత్స్యనారాయణ స్వామి, అష్టలక్ష్మి సమేత ఆదిలక్ష్మి అమ్మవార్ల వార్షిక కల్యాణ మహోత్సవాలు గురువారం నుంచి 13 వరకు ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 11న మత్స్యనారాయణ స్వామి జయంతి సందర్భంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పంచామృతాభిషేకం, హోమంతో పాటు108 సార్లు మత్స్య గాయత్రి మంత్రం జపాన్ని పఠిస్తారని, 12న ఆదిలక్ష్మి అమ్మవారికి విశేషార్చన, 13న శాంతి హోమం, పూర్ణాహుతి, శాంతి కల్యాణం ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు కల్యాణ మహోత్సవాల్లో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

సత్తెమ్మ తల్లి సేవలో శ్రీరంగనాథరాజు



సిద్ధాంతం చింతల పాలెం సత్తెమ్మ తల్లిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: మండలంలోని సిద్ధాంతం చింతలపాలెంలోని సత్తెమ్మ తల్లి జాతర మహోత్సవాల్లో మాజీమంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. బుధవారం శెట్టిబలిజ సంఘం ఆహ్వానం మేరకు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సిద్ధాంతం గ్రామ అధ్యక్షుడు జుత్తిగ దామోదర్ రావు, ఎస్సీ సెల్ మండల కన్వీనరు పలివెల శ్రీను, సంఘ పెద్దలు బొక్కా కొండయ్య, పిల్లి దుర్గారావు, కౌరు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వాసవి వనిత క్లబ్ సేవలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక వాసవి వనితక్లబ్ ఆధ్వర్యంలో పలుసేవా కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం క్లబ్ ఆధ్వర్యంలో రాహుల్ వృద్ధాశ్రమంలో వాషింగ్ మెషీన్, ఇడ్లీ రవ్వ బస్తా, దిండ్లు, సీహెచ్‌ఆర్ అండ్ ఎస్ మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో వంట సామగ్రి, మిక్సీ, వృద్ధురాలికి వెయ్యి రూపాయలు నగదు, విద్యార్థినికి సైకిల్ అందజేశారు.

ఉత్సాహంగా ఇంటింటి ప్రచారం



యలమంచిలి: ఏనుగువానిలంకలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న గుడాల గోపి భార్య మంగతాయారు, కుమారుడు సాయి బాలాజీ



మొగల్తూరు: శేరేపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న అసెంబ్లీ అభ్యర్థి ప్రసాదరాజు కుమారుడు, అల్లుడు



నరసాపురం: 4వ వార్డులో ప్రజలను ఓట్లు అడుగుతున్న శారదావాణి

నరసాపురం: నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పెద్ద ఎత్తున కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మళ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజును గెలిపించాలని ముదునూరి సతీమణి శారదావాణి ప్రజలకు సూచించారు. భర్త గెలుపు కోరుతూ శారదావాణి పట్టణంలో గత వారం రోజులుగా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. బుధవారం ఆమె పట్టణంలోని 4,5 వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించారు. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. ముదునూరి గత ఐదేళ్ల నుంచి నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే వైఎస్సార్ సీపీని గెలిపించాలని, ముదునూరి ప్రసాదరాజును మరోసారి ఎమ్మెల్యేగా చేయాలన్నారు. నరసాపురం ఎంపీగా ఓ బీసీ మహిళను వైఎస్సార్ సీపీ తరఫున నిలబెట్టారని చెప్పారు. అఖండ మెజార్టీతో ఆమెను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆమె వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, కౌన్సిలర్ మల్లాడి బుజ్జి, పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు కాగిత సత్యవాణి తదితరులు ఉన్నారు.

శేరేపాలెంలో..

మొగల్తూరు: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన ఈ ఐదు సంవత్సరాల్లో జరిగిన జరుగుతున్న అభివృద్ధిని చూసి మరోసారి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అసెంబ్లీ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు తనయుడు శ్రీ కృష్ణంరాజు, అల్లుడు అనిర్వన్ ఓటర్లను అభ్యర్థించారు. ప్రజాశీర్వాద ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మండలంలోని శేరేపాలెంలో తనయుడు, అల్లుడు ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరసాపురం నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి ఈ ఐదు సంవత్సరాలలో జరిగిందన్నారు. గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం గ్రామంలోని ప్రతీ గడపకు తిరుగుతూ ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ, వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు లోకం నాని, రంగిశెట్టి ఏసు, కొత్తపల్లి బాబి, తన్నీడి గిరి, వేగి బాబి, కొత్తపల్లి దొరబాబు,గూడూరి మావుళ్ల తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల రథసారథిని ఆశీర్వదించాలి

యలమంచిలి: సంక్షేమ పథకాల రథసారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా మరొకసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) భార్య మంగతాయారు, కుమారుడు సాయి బాలాజీ కోరారు. ఏనుగువానిలంక గ్రామంలో వారిరువురు బుధవారం గోపి తరఫున ఎన్నికల ప్రచారం చేశారు. తన, మన అనే పక్షపాతం చూపకుండా ప్రజలంతా తనవారిగా చూసుకునే పాలన సాగించిన ముఖ్యమంత్రి ఇంతరవకు మనం చూడలేదన్నారు. చంద్రబాబు మోసపూరిత వాగ్దానాలకు మోసపోకుండా ప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డికి ఓటేసి బాసటగా నిలబడాలని వారు కోరారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు, ఎంపీటీసీ సభ్యురాలు వినుకొండ ధనలక్ష్మి మాజీ సర్పంచ్ వినుకొండ రవికుమార్ పార్టీ గ్రామ కమిటి అధ్యక్షులు మల్లుల ఏడుకొండలు, ఉల్లంపర్తి జాన్ నాయకులు మేళం రామాంజనేయులు, దిడ్ల విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయం వద్ద సామూహిక కుంకుమ పూజలు

మొగల్తూరు: మొగల్తూరు పంచాయతీలోని కుక్కలవారితోటలో ఉన్న చెట్టు కింద ముత్యాలమ్మ అమ్మవారి జాతర సందర్భంగా బుధవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఉగాది పండుగను పురస్కరించుకుని మంగళవారం రాత్రి అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించి అమ్మవారిని సాగనంపారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయ ప్రాంగణంలో కుంకుమ పూజలు చేశారు.

ప్రేమ, దాతృత్వానికి ప్రతీక రంజాన్



పూలపల్లిలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాలకొల్లు అర్బన్: ప్రేమ, దాతృత్వానికి ప్రతీకగా రంజాన్ పండుగను ముస్లింలు జరుపుకోవడం అభినందనీయమని టీటీడీ పాలక మండలి సభ్యులు మేకా శేషుబాబు అన్నారు. రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ముగింపు సందర్భంగా పూలపల్లి సున్నీ జామియా మసీదులో నిర్వహించిన ఇఫ్తార్ విందులో శేషుబాబు పాల్గొని మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) తనయుడు సాయి బాలాజీ పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చింతలపూడి పరిశీలకుడు గుణ్ణం నాగబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, అడబాల వెంకటరమణ, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దొమ్మేటి శ్రీనివాస్, సున్నిజామియా మసీద్ పెద్దలు షేక్ యాకూబ్, షేక్ అబ్దుల్ కరీమ్, షేక్ బాబ్జి, షేక్ గౌస్, గయాస్ ఉద్దీన్, మీరా, రబ్బాన్, షేక్ వలీ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పూలపల్లికి చెందిన దుబాయ్ ప్రసాద్ విరాళంతో ముస్లింలకు తోఫా అందజేశారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



ఆచంటలో ఎన్నికల సిబ్బందికి శిక్షణనిస్తున్న ఆర్‌డీ స్వామి నాయుడు

పెనుగొండ: ఎన్నికల విధులు కీలకమైనవని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆచంట నియోజకవర్గ ఎన్నికల అధికారి, పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టరు వి.స్వామి నాయుడు అన్నారు. బుధవారం ఆచంటలో ఎన్నికలకు సంబంధించి ఈవీఎం, బ్యాలెట్ యూనిట్స్ పనితీరు, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్ల వద్ద నిర్వహించే విధులు, బాధ్యతలు , ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ నిచ్చారు. వీవీ ప్యాడ్స్ పనితనం, ఎన్నికల బ్యాలెట్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్స్‌లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. టెండర్ బ్యాలెట్లు, చాలెంజింగ్ ఓట్లు, టెస్ట్ ఓట్లు, ఐదుగురు పోలింగ్ అధికారుల విధులు, ఈవీఎం రీప్లెస్మెంట్ విధానం, పలు ఫారాల పూర్తి చేసే విధానాలపై శిక్షణ ఇచ్చారు. పరీక్ష అనంతరం పరీక్ష నిర్వహించడంతో పాటు, ఫీడ్ బ్యాక్ ఫారాలు స్వీకరించారు. పోస్టల్ బ్యాలెట్ కోసం ఎన్నికల డ్యూటీ ఆర్డర్ కాపీ, ఫారం 12, ఆధార్ కార్డు జిరాక్స్, ఓటరు గుర్తింపు కార్డు జిరాక్స్‌లుపై వివరించారు. పెనుగొండ మండలం సంబంధించి 60 మంది, పెనుమంట్ర మండలానికి సంబంధించి 65 మందికి, ఆచంట మండలం నుంచి 57 మందికి, పోడూరు మండలానికి గానూ 50 మందికి మొత్తంగా 232 శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

దూషించడం.. మభ్యపెట్టడం చంద్రబాబు నైజం



వల్లూరులో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



వల్లూరులో మహిళలకు అభివాదం చేస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: దూషించడం.. మభ్యపెట్టడం చంద్రబాబు నైజమని, రాష్ట్రంలో ప్రతీ ఒక్కరికీ ఈ విషయం తెలుసునని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. బుధవారం ఆచంట మండలం వల్లూరులో ఎన్నికల శంఖారావంలో భాగంగా పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆశీస్సులు తీసుకున్నారు. ఐదేళ్లల్లో ప్రజలకు అందించిన సంక్షేమాన్ని, గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. రెండూ ఓట్లూ ఫ్యాన్ గుర్తుకే వేసి పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నిన్న మొన్నటి వరకూ వలంటీర్లను మానసిక క్షోభకు గురి చేసిన చంద్రబాబు నేడు కొత్త పల్లవి అందుకొన్నారన్నారు. గోనే సంచులు మోసే ఉద్యోగం అంటూ వలంటీర్లను కించ పరిచారన్నారు. దీంతో పాటు డేటా చోరీ, కిడ్నాప్‌లు అంటూ చంద్రబాబు, వారి కూటమి నాయకులు నిత్యం దూషించడంతో పాటు, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి వలంటీర్లను ప్రజా సేవ నుంచి దూరం చేశారన్నారు. నేడు వలంటీర్లను మభ్యపెట్టడానికి ప్రయత్నాలు ప్రారంభించారన్నారు. వ్యవస్థను పునః ప్రారంభిస్తామంటూ, జీతాలు పెంచుతామంటూ నమ్మబలుకుతున్నారన్నారు. వలంటీర్లు ఎవరూ చంద్రబాబు మాట నమ్మే స్థితిలో లేరన్నారు. రాష్ట్రంలో ప్రజలందరూ మరోసారి సీఎం జగన్‌కు పట్టం కట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనంద్ ప్రకాష్ ,రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ చైర్మన్ మేడిది జాన్సన్, ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీసుభాషిణీ. ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, చాంబర్ అధ్యక్షులు సుంకర సీతారాం, ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరెక్టర్ బొక్కా అరుణ, సొసైటీ చైర్మన్ నారిన వీర వెంకట సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు ఏడిద రామలక్ష్మి, మైలే ఏసురత్నం, ఏనుగుపల్లి వర ప్రసాద్, కంబాల భాస్కర్ రావు,బొక్కా శ్రీను, పెచ్చెట్టి సత్యనారాయణ, బూలా ప్రసాద్, రాగాన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ నాయకుడు కుసుమె వెంకట్రావు మృతి



వెంకట్రావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పోడూరు: పెనుమదం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కుసుమె వెంకట్రావు(84) మంగళవారం మృతి చెందారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లెం ఆనందప్రకాష్ బుధవారం వెంకట్రావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకట్రావు మృతి చెందడం పార్టీకి తీరని లోటరన్నారు. వెంకట్రావుకు భార్య లక్ష్మీకాంతం, ఐదుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వెంకట్రావు మృతిపట్ల గ్రామపెద్దలు, వైఎస్సార్ సీపీ నాయకులు, సంఘ పెద్దలు సంతాపం తెలిపారు.

మద్యం షాపుల తనిఖీ

ఆకివీడు: ఎన్నికల నేపథ్యంలో మద్యం షాపుల వద్ద ఉన్న నిల్వలు, రికార్డులను మండల ప్రత్యేక బృందాలు మండలంలోనూ, నగర పంచాయతీ పరిధిలోనూ మంగళ, బుధవారాల్లో తనిఖీలు చేశారు. తనిఖీల వివరాలను బృందంలోని అధికారులు బుధవారం విలేకరులకు తెలిపారు. ఆయా షాపుల్లో మద్యం అమ్మకాలు, నగదు, రికార్డులు, నిల్వలు, భౌతిక నిల్వలను పరిశీలించామని వివరించారు. ఆన్‌లైన్ అమ్మకాలు, స్టాక్ ఆయా ప్రాంతాల్లో సక్రమంగా ఉందని తెలిపారు.